సాక్షి
ఖమ్మం
బుధవారం । 22 । మార్చి । 2023



సినిమా తరహాలో ఛేజింగ్

ఒడిశా నుంచి కర్ణాటకకు గంజాయి రవాణా చేస్తున్న వారి వాహనాలను పోలీసులు సినీ ఫక్కీలో ఛేజ్ చేసి అదుపులోకి తీసుకున్నారు. 10లో



తొమ్మిదేళ్లలో ఎవరికేం చేశారు?


దేశంలో అధికారంలోకి వచ్చాక బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం ఆరోపించారు. 10లో

గరిష్టం / కనిష్టం
34° / 24°

వాతావరణం

బుధవారం ఉదయం జిల్లాలో వాతావరణం చల్లగా ఉంటుంది. ఆతర్వాత ఉష్ణోగ్రత పెరుగుతూ వస్తుంది.

చేయి.. చేయి కలిసేదెలా?



కాంగ్రెస్‌ను వీడని వర్గ రాజకీయాలు

- ఎన్నికలు సమీపిస్తున్న వేళ వేరు కుంపట్లు
- వైరాలో 'హాథ్ సే హాథ్' యాత్రపై సమాచారం లేదంటున్న భట్టి వర్గీయులు
- డీసీసీకి తెలియకుండానే ప్రకటించడంపై బయటపడిన వర్గవిబేధాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లా కాంగ్రెస్‌లో అనైక్యత మరోసారి బయటపడింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అంతా కలిసికట్టుగా పనిచేయాలని అధిష్టానం సూచించినా జిల్లా పార్టీలో ఆ దిశగా అడుగులు పడటం లేదు. నేతలు వర్గాలుగా విడిపోవడం, వెన్నుదన్నుగా నిలవాల్సిన వారే పార్టీని బలహీన పరుస్తున్నారని కార్యకర్తలు నైరాశ్యానికి గురవుతున్నారు. వైరాలో ఈనెల 26న హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపడుతున్నట్లుగా కేంద్ర మాజీ మంత్రి రేణుక వర్గీయులు సోమవారం వెల్లడించారు. అయితే, ఈ విషయమై ఇటు పార్టీ జిల్లా అధ్యక్షుడికి కానీ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు కానీ కనీస సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. ఈ పరిణామాలు జిల్లాలో మరోసారి రేణుక – భట్టి వర్గీయుల మధ్య విబేధాలను బహిర్గతం చేశాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చేతికి చేయి కలుపు(హాథ్ సే హాథ్ జోడో) అంటూ యాత్రలు నిర్వహిస్తుండగా జిల్లాలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొనడం గమనార్హం.

వైరాలో భట్టి వర్సెస్ రేణుక..

వైరాలో కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి వర్గం నుంచి ధరావత్ రామ్మూర్తినాయక్, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వర్గం నుంచి మాలోతు రాందాస్‌నాయక్, బానోత్ బాలాజీనాయక్ టికెట్లు ఆశిస్తున్నారు. వీరిలో రాందాస్, రామ్మూర్తి వైరాలో క్యాంప్ కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. బాలాజీనాయక్ కొంత స్తబ్దుగా ఉన్నారు. ఇక్కడ సీఎల్పీ నేత భట్టి, కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి వర్గీయుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. జిల్లావ్యాప్తంగా గ్రూపు రాజకీయాలు ఉన్నా.. వైరాలో మాత్రం కాస్త ఎక్కువగా కనిపిస్తున్నాయి.

సీఎల్పీ నేత, డీసీసీ అధ్యక్షుడికి తెలియకుండానే..

రేణుకాచౌదరి వర్గీయులు వైరాలో సోమవారం సమావేశం ఏర్పాటుచేసిన ఈనెల 26న వైరాలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర, బహిరంగ సభ ఉంటాయని.. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతారని వెల్లడించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, పీసీసీ చీఫ్ వస్తున్నప్పటికీ.. దీనిపై తమకు సమాచారం లేదని భట్టి వర్గీయులు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ చెబుతుండడం వైరా నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా కేడర్‌లో చర్చకు దారి తీసింది. వైరాలోనే కాక జిల్లాలోని పలు నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ ఇదే పరిస్థితి ఉండడం కార్యకర్తల్లో అసంతృప్తికి కారణమవుతోంది. తాము పార్టీపై అభిమానంతో పనిచేస్తుంటే నాయకులు వర్గాలుగా విడిపోయి చేటు చేస్తున్నారని ఆవేదనకు లోనవుతున్నారు. ఇకనైనా అధిష్టానం వర్గ విభేదాలపై దృష్టి సారిస్తేనే వచ్చే ఎన్నికల్లో పార్టీకి విజయావకాశాలు మెరుగవుతాయని కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎవరి దారి వారిదే..

జిల్లా కాంగ్రెస్‌ను దశాబ్దాలుగా వర్గపోరు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అధికారంలో ఉన్నా, లేకున్నా నేతల మధ్య ఐక్యత, సఖ్యత కనపడటం లేదు. జిల్లాస్థాయిలోనే కాక నియోజకవర్గాల్లోనూ గ్రూపులు కాంగ్రెస్‌లో ఆనవాయితీగా కొనసాగుతున్నాయి. టికెట్లు ఆశిస్తున్న నియోజకవర్గ స్థాయి నేతలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. వీరికి జిల్లాలోని రాష్ట్రస్థాయి నేతలు అభయం ఇస్తుండడం గమనార్హం. ఖమ్మం, సత్తుపల్లి, వైరా, పాలేరు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి కాస్త ఎక్కువగా ఉండగా.. అధిష్టానం పిలుపునిచ్చే ఆందోళనలను కూడా గ్రూపుల వారీగానే నిర్వర్తిస్తున్నారు. గతంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకం విషయంలోనూ గ్రూపు రాజకీయాల కారనంగా చాన్నాళ్లు ప్రతిష్ఠంభన నెలకొనగా... పీసీసీకి సైతం తలనొప్పిగా మారింది.

మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



మహిళలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ స్నేహలత

రఘునాథపాలెం/ఖమ్మం రూరల్: మహిళలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యాధినిర్ధారణ, ఉచిత చికిత్స కోసం ఆరోగ్య మహిళా కేంద్రాలను ఏర్పాటు చేసిందని జిల్లా అదనపు కలెక్టర్ స్నేహలత తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ, ఖమ్మం రూరల్ మండలం వెంకటాయపాలెంలోని పీహెచ్‌సీలో మంగళవారం మహిళలకు నిర్వహిస్తున్న పరీక్షలను ఆమె పరిశీలించి మాట్లాడారు. మహిళా ఆరోగ్య కేంద్రాల్లోని ఎనిమిది విభాగాల్లో మహిళలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ జరిగితే చికిత్స చేయనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాలపై ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు ప్రచారం చేయాలని సూచించారు. మహిళలకు పరీక్షలు నిర్వహించాక ఆన్‌లైన్‌లో నమోదు, చికిత్స వివరాలను పరిశీలించిన అదనపు కలెక్టర్.. సూచనలు చేశారు. వైద్యాధికారులు సంధ్యారాణి, శ్రీదేవి, ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 603మంది గైర్హాజరు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ద్వితీయ సంవత్సరం పరీక్షకు జిల్లాలో 16,016మంది విద్యార్థులు గాను 15,413మంది హాజరు కాగా 603 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు తెలిపారు. జనరల్ విభాగంలో 13,895మందికి 13,428మంది, ఒకేషనల్ విభాగంలో 2,121మందికి 1,985మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన వెల్లడించారు.

నూతన ఉత్సాహానికి నాంది..

ఉగాది



...వివరాలు 8లో

17.36 ఎకరాల అసైన్డ్ భూమి స్వాధీనం

విలువ రూ.50 కోట్ల పైమాటే..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మల్లెమడుగు రెవెన్యూ పరిధిలోని అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కావడంతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏళ్ల క్రితం పేదలకు సాగు అవసరాల నిమిత్తం ప్రభుత్వం అసైన్డ్ భూములను పంపిణీ చేయగా.. అవి చేతులు మారుతూ వచ్చాయి. కొందరు లబ్ధిదారులే అమ్ముకోగా, మరికొంత భూమిని రియల్టర్లు ఆక్రమించినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో విచారణ అనంతరం 19.05 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్ ఖమ్మం అర్బన్ తహసీల్దార్ శైలజను ఆదేశించారు. ఈమేరకు ఆమె సిబ్బందితో చేరుకుని ఎకరం పైగా పట్టా భూమి కూడా ఉన్నట్లు గుర్తించగా.. అదిపోగా 17.36 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని హద్దు రాళ్లు పాతించడంతో పాటు ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో గజం ధర సుమారు రూ.10 వేల వరకు ఉండగా..



హద్దులు ఏర్పాటుచేయిస్తున్న తహసీల్దార్ శైలజ

ఎకరం మేర రోడ్లుగా పోయినా అధికారులు స్వాధీనం చేసుకున్న భూమి విలువ సుమారు రూ.50 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. పదేళ్ల క్రితం ఈ భూమిని పలువురికి కేటాయించగా.. ప్లాట్లుగా మార్చడంతో చేతులు మారుతూ వచ్చింది. ఇప్పుడు అక్కడ వ్యవసాయం చేసినట్లుగా ఆనవాళ్లు కూడా లేకపోవడం గమనార్హం. కాగా, భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్న నేపథ్యాన రియల్టర్ల నుంచి కొనుగోలు చేసిన వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

నగరానికి మరో మూడు ఎస్‌టీపీలు

రూ.280 కోట్ల నిధులు కేటాయింపు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గృహాలు, వ్యాపార సముదాయాల నుండి వెలువడే నీటిని శుద్ధీకరించేందుకు ప్రభుత్వం నగరానికి మరో మూడు ఎస్‌టీపీ(సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లను మంజూరు చేసింది. రూ.280 కోట్లతో నగరంలోని మూడు ప్రాంతాల్లో వీటిని నిర్మించేందుకు నిధులు కేటాయించింది. ఇప్పటికే గోళ్లపాడు చానల్ ద్వారా మున్నేరులో కలిసే మురుగు నీటిని శుద్ధి చేసేందుకు శ్రీనివాసనగర్‌లో ఒక ప్లాంట్ నిర్మిస్తున్నారు. ఇప్పుడు మరో మూడు ప్లాంట్ల నిర్మాణానికి అనుమతి లభించింది. పుట్టకోట, దానవాయిగూడెం, మున్నేరు పరివాహక ప్రాంతాల్లో వీటిని నిర్మించనున్నట్లు తెలుస్తోంది. మున్నేరు, ప్రధాన చెరువుల్లో మురుగు కలవడంతో నీరు కలుషితమవుతున్నందున ప్రభుత్వం మరో మూడు ఎస్‌టీపీలను మంజూరు చేసినట్లు సమాచారం.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం నుంచి 31వ తేదీ వరకు శ్రీవారి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు ఆలయానికి రంగులు వేయడంతో పాటు మంగళవారం శుద్ధి సంప్రోక్షణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవేంకటేశ్వరస్వామి వారికి పంచామృతంతో అభిషేకం, కలశస్థాపన, పంచాంగ శ్రవణంతో పాటు పుష్కరిణి నుండి యాగశాలకు తీర్థపు బిందె తోడ్కొని వస్తామని ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ తెలిపారు.

అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి

ఖమ్మంలీగల్: అవినీతి రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయశాఖలోని నాలుగో తరగతి ఉద్యోగులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతర శ్రమతో మంచి ఫలితం వస్తుందని తెలిపారు. ఏ పనైనా ఇష్టంగా చేస్తూ, లంచం లేని సమాజాన్ని నిర్మించడాన్ని బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాసంస్థ కార్యదర్శి జావేద్‌పాషా, న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ, అధికారులు ఓంకార్, రాధేశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: రబీ సీజన్‌లో జిల్లా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాటుచేయనున్న కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమై ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ ఏడాది రబీలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పగా.. జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే దిగుమతికి అవకాశం ఉందని మిల్లర్లు వెల్లడించారు. దీంతో అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. పౌర సరఫరాల శాఖాధికారి రాజేందర్, డీఎం సోములు, ఏఎంటీ నర్సింహరావు, డీఆర్‌డీఓ విద్యాచందన, రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజాప్రతినిధుల ఉగాది శుభాకాంక్షలు

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్/సత్తుపల్లి/వైరా: తెలుగు నూతన సంవత్సరాది శోభకృత్‌నామ ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. అలాగే, ఎంపీలు నామ నాగేశ్వర రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, లావుడ్యా రాములునాయక్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి కూడా వేర్వేరు ప్రకటనల్లో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌ఎండీసీ సీఎండీకి ఎమ్మెల్యే సండ్ర సన్మానం

సత్తుపల్లి/కల్లూరు: సింగరేణి సీఎండీగా విధులు నిర్వర్తిస్తూ నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌డీసీఎం) సీఎండీ నియమితులైన ఎన్.శ్రీధర్‌ను హైదరాబాద్‌లో మంగళవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కలిసి సత్కరించారు. ఆతర్వాత జల వనరుల శాఖ ఈఎన్‌సీ నాగేంద్రరావును కలిసి ఎన్నెస్పీ ఆయకట్టుకు ఏప్రిల్ 10వరకు నీరు విడుదల చేయాలని కోరారు. కాగా, కల్లూరు శాంతినగర్‌కు చెందిన ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు గొడిపేరు జర్మియాబాబు హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా ఆయనను ఎమ్మెల్యే సండ్ర పరామర్శించారు.

పెండింగ్ వేతనాలు, బిల్లుల కోసం 24న నిరసన



అభివాదం చేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల వేతనాలు, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 24న జిల్లాలోని ఖజానా శాఖ కార్యాలయాల వద్ద నిరసన తెలపనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వర రావు, వడ్డె వెంకటేశ్వరరావు, సలవాది విజయ్ తెలిపారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు మన్సూర్, యాదగిరి, హసేన్, రామకృష్ణ, బాబురావు, ఏ.బన్సీలాల్, ఏ.నాగేశ్వరరావు, పి.వెంకన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రూ.54 లక్షలకు పాలేరు సంత వేలం

కూసుమంచి: మండలంలోని పాలేరు వారాంతపు సంత నిర్వహణను ఏడాది పాటు అప్పగించేందుకు మంగళవారం వేలం నిర్వహించారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.62 లక్షలతో వేలం ప్రారంభించగా 17మంది వ్యాపారులు హాజరయ్యారు. చివరకు నకిరేకల్‌కు చెందిన జాల సైదులు అత్యధికంగా రూ.54 లక్షలకు పాడి సంత కైవసం చేసుకున్నాడు. గత ఏడాది వేలంలో రూ.48.30 లక్షల ఆదాయం రాగా, ఈసారి రూ.5.70 లక్షలు పెరిగింది. ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ రాంచందర్, సర్పంచ్ ఎడవెల్లి మంగమ్మ, ఎంపీటీసీ నాగమణితో పాటు యాకూబ్‌పాషా, నరేష్ పాల్గొన్నారు.

నూతనోత్సాహానికి నాంది.. ఉగాది

- షడ్రుచుల పచ్చడి.. పండుగ ప్రత్యేకం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు
- నేడు శ్రీ శోభకృత్ నామ సంవత్సర వేడుకలు



ఖమ్మంలో పూలు, మామిడాకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



పచ్చడి తయారీకి కుండలు పరిశీలిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు ప్రజల తొలి పండుగ ఉగాది. ఉగాది అనే పదం యుగాది నుండి రాగా.. బుధవారం చైత్రశుద్ధ పాడ్యమిగా కొత్త సంవత్సరం ప్రారంభమవుతోంది. నూతన ఉత్సాహాలకు నాందిగా పండుగ జరుపుకోనుండగా.. ఈ ఏడాదిని శ్రీ శోభకృత్ నామ సంవత్సరంగా వ్యవహరిస్తారు. కాగా, జిల్లా ప్రజలు సంప్రదాయ పద్ధతుల్లో శ్రీ శోభకృత్ నామ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఉగాది వేడుకలను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేయగా.. అర్చకులు పంచాంగ పఠనం చేయనున్నారు. అలాగే, రానున్న శ్రీ రామ నవమిని పురస్కరించుకుని వేడుకలు బుధవారమే మొదలుకానున్నాయి.

నూతన పనులు ప్రారంభం

ఉగాది రోజుల కొత్త పనులను ప్రారంభించడం ఆనవాయితీ. ప్రధానంగా గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. పశువులను అలంకరించి వ్యవసాయ భూముల్లోకి సేంద్రియ ఎరువులు తోలడం ఆరంభిస్తారు. అలాగే, వ్యాపార సంస్థలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇంకా ఇళ్లలో లక్ష్మీదేవికి దీపారాధన, గో పూజ, గోప్రదక్షణ చేస్తారు.

ఉగాది పచ్చడి ప్రత్యేకం

ఉగాది వసంత రుతువు ఆగమనం ప్రారంభమైన రోజు. ఈ రోజు షడ్రుచులు కలిపిన పచ్చడి తయారు చేసి తినడం ఆనవాయితీ. తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు రుచులతో ఉండే ఈ పచ్చడి తయారీ కోసం మామిడికాయలు, కొత్త చింతపండుగ ఇతరత్రా సామగ్రితో పాటు కొత్త కుండలు అమ్మకాలు జోరుగా సాగాయి.

పంచాంగ పఠనానికి ప్రాధాన్యత

ఆలయాల్లో పండితులు వినిపించే పంచాంగ పఠనానికి ప్రజలు ప్రాధాన్యతను ఇస్తారు. ఈ ఏడాది ఆదాయ, వ్యయాలు, ఇతర వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి కనబర్చనుండగా.. రైతులు కాలం తీరు, పంటల సాగు వివరాలు తెలుసుకుంటారు.

భవిష్యవాణిని తెలిపేదే పంచాగం



పంచాంగం భవిష్యవాణిని తెలుపుతుంది. ఈ పంచాంగం ద్వారా దినాధిపతులు, తారాబలం తెలుసుకోవచ్చు. రానున్న ఏడాది సంభవించే పరిణామాలు కూడా వివరించబడుతాయి. వర్షాలు, పంటలు, కాలంతో పాటు వ్యాపారాలు, ఉద్యోగాలు, వ్యాపారం తదితర అంశాలను పంచాంగం ద్వారా వివరిస్తారు.

– మార్త వీరభద్ర ప్రసాద్‌శర్మ, స్తంభాద్రి పౌరోహిత సంఘం అధ్యక్షుడు

పంచాంగ శ్రవణం ప్రత్యేకం



ఉగాది రోజున పంచాంగం శ్రవణం, పఠనానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. దేవాలయాలు, క్షేత్రాల్లో పంచాంగ పఠనం సందర్భంగా నూతన సంవత్సరం ఏయే రంగాలకు అనుకూలం, ఏయే రంగాలకు ప్రతికూలం, ఏ పంటల సాగు చేసుకోవాలి, వర్షాలు ఎలా ఉంటాయో పండితులు వివరిస్తారు. – ఆమంచి సురేష్ శర్మ, అర్చకులు

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు



కొణిజర్ల : మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఏఓ విజయనిర్మల

బోనకల్/కొణిజర్ల: బోనకల్, కొణిజర్ల మండలాల్లో ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న పంటలను అదనపు కలెక్టర్ మధుసూదన్, జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం, గోవిందాపురం, గార్లపాడు, రామాపురం, రావినూతల, కొత్తకాచారం, పాతకాచారంలో వారు పర్యటించారు. తహసీల్దార్ శ్వేత, సర్పంచ్ సూరంపల్లి రామారావు, ఏఓలు అబ్బూరి శరత్‌బాబు, బాలాజీ, రైతుబంధు కన్వీనర్ వేమూరి ప్రసాద్, ఆర్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

పంట నష్టంపై కమిషనర్ టెలీ కాన్ఫరెన్స్

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షాలతో పంట నష్టంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 19,732 మంది రైతులకు చెందిన 31,038 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు వివరించారు. ఇందులో ఎక్కువగా మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

ఘనంగా 'న్యూ ఇరా' వార్షికోత్సవం



మాట్లాడుతున్న జూలూరి గౌరీశంకర్, పక్కన కలెక్టర్ గౌతమ్, పాఠశాల డైరెక్టర్లు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని న్యూ ఇరా పాఠశాల 28వ వార్షికోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని శ్రద్ధగా చదువుకుంటూ వాటిని సాధించడమే కాక తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడారు. ఆతర్వాత పాఠశాల చైర్మన్ ఐ.వీ.రమణారావు, డైరెక్టర్ పి.భూమేశ్వర రావు మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందించటం ద్వారా వారు ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించగా.. వివిధ పోటీ పరీక్షల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లిలో ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును మంగళవారం గుర్తు తెలియని దుండగుడు లాక్కొని పరారయ్యాడు. గ్రామానికి చెందిన ఇనుకుర్తి నారాయణమ్మ భర్త గాంధీరెడ్డి పొలానికి వెళ్లగా, ఆమె ఒంటరిగా ఉంది. దీంతో మాస్క్ ధరించిన దుండగుడు ఫోన్ మాట్లాడుతూ ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని సుమారు మూడు తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడని ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు.

కోదండ రామాలయంలో చోరీ

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురం కోదండ రామాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీ తాళం పగలుగొట్టి సుమారు రూ.20వేల నగదు చోరీ చేశారు. ఘటనపై సర్పంచ్ కన్నయ్య ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై నాగరాజు దర్యాప్తు చేపట్టారు.

ఎర్త్ పైపుల చోరీకి యత్నం

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం–శంకరగిరితండా మధ్య ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ పైపులు చోరీ చేసేందుకు మంగళవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించారు. అయితే, సమీప రైతులు గుర్తించి కేకలు వేయడంతో దొంగలు బైక్‌పై పరారయ్యారు. దీంతో రైతులు కూడా కాసేపు వెంబడించినా చిక్క లేదు. దుండగులు బైక్‌పై వెళ్తున్న దృశ్యాలు రాజేశ్వరపురం వైన్స్ సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. రాజేశ్వరపురం ఏఈ బాలాజీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు కనిపిస్తే రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వేసిన తాళం వేసినట్లే.. బంగారం మాత్రం చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం వీడీఓస్ కాలనీలోని ఓ ఇంట్లో పట్టపగటే చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వీడీఓస్ కాలనీలో నివాసముండే భూక్యా ప్రసాద్ గ్రానైట్ ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండగా, ఆయనతో పాటు కుటుంబీకులు మంగళవారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. పరీక్ష రాయడానికి వెళ్లిన ఆయన పిల్లలతో పాటు కుటుంబీకులు మధ్యాహ్నం ఇంటికి వచ్చాక బీరులో చూస్తే 25 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. అయితే, ఇల్లు, బీరువా తాళం వేసినట్లే ఉండడంతో ఎలా చోరీ జరిగిందనేది తెలియరాలేదు. కాగా, వారు వెళ్లేటప్పుడు ఇంటి తాళం బయట ఉన్న బూట్లలో పెట్టి వెళ్లగా, తెలిసిన వారే చోరీ చేసి మళ్లీ తాళం పెట్టి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మధిరలో జీఎస్టీ అధికారుల తనిఖీలు



గోదాంలో తనిఖీ చేస్తున్న జీఎస్టీ అధికారులు

మధిర: మధిరలోని పలు వ్యాపార సంస్థల్లో మంగళవారం సెంట్రల్ జీఎస్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. జీఎస్టీ చెల్లింపులు లేకుండా పలువురు వ్యాపారం చేస్తుండగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందనే ఫిర్యాదులతో తనిఖీలు నిర్వహించారు. సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాజా రత్నాకర్ ఆధ్వర్యాన వ్యాపార సంస్థలు, గోదాంలు, పార్సిల్ సర్వీస్ పాయింట్లలో సోదా చేసి రికార్డులు పరిశీలించారు. కాగా, తనిఖీల సమాచారం తెలుసుకున్న కొందరు వ్యాపారులు దుకాణాలను మూసివేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ రాజారత్నాకర్ మాట్లాడుతూ వ్యాపారులు ప్రతీ లావాదేవీపై నిబంధనల ప్రకారం జీఎస్టీ చెల్లించాలని సూచించారు. జీఎస్టీ అధికారులు రణధీర్, హేమంత్, వినాయక్ పాల్గొన్నారు.

ఈనెల 31న బార్ ఎన్నికలు

ఖమ్మం లీగల్: బార్ అసోసియేషన్ ఎన్నికలను ఈనెల 31న నిర్వహించనుండగా.. ఎన్నికల అధికారిగా ఎస్.సోమశేఖర్‌ను నియమించారు. ఈమేరకు ఆయన ఆయన మంగళవారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. ఈనెల 24న నామినేషన్ల పత్రాల స్వీకరిస్తామని, 25న ఉపసంహరణకు అవకాశం ఇచ్చి అదే రోజు అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. ఇక పోలింగ్ 31న ఉదయం 10నుండి సాయంత్రం 3గంటల వరకు నిర్వహించి, సాయంత్రం 4 గంటలకు ఫలితాలు వెల్లడిస్తామని సోమశేఖర్ పేర్కొన్నారు. కాగా, బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దిరిశాల కృష్ణారావు, ఆర్.సుధీర్‌సింగ్, ఎం.ఏ.తౌఫిక్, సీ.హెచ్.స్వర్ణకుమారి, నేరళ్ల శ్రీనివాసరావు, మల్లెంపాటి అప్పారావు, కార్యదర్శి పోస్టుకు చింతనిప్పు వెంకట్, మన్నేపల్లి బసవయ్య పోటీలో ఉన్నారు.

పాన్‌కార్డు పేరిట రూ.21వేలు స్వాహా

ఖమ్మంఅర్బన్: పాన్‌కార్డు అప్‌డేట్ చేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తి చేసిన ఫోన్‌కు స్పందించి ఓటీపీ చెప్పడంతో ఖాతా నుంచి రూ.21వేలకు పైగా నగదు స్వాహా అయిన ఘటన ఇది. నగరంలోని ఖానాపురానికి చెందిన సీహెచ్.వెంకటేశ్వరరావుకు ఈనెల 17న గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి పాన్‌కార్డ్ అప్‌డేట్ చేస్తామంటూ నమ్మబలికి ఓటీపీ తెలుసుకున్నారు. ఆయన మంగళవారం బ్యాంకులో బ్యాలెన్స్ చూసుకోగా రూ.21,165 విత్‌డ్రా అయినట్లు తెలియడంతో మోసపోయినట్లుగా గుర్తించి ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలుకింద పడి ఆత్మహత్య

మధిర: వ్యక్తిగత కారణాలతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దెందుకూరుకు చెందిన కొలకలూరి వెంకటేశ్వర్లు(60) గ్రామానికి సమీపాన మధిర–తొండల గోపవరం స్టేషన్ల నడుమ మంగళవారం శ్రద్ధసేతు ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ బాధ్యుల సాయంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్సై పి.భాస్కర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ శీలం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

కోతుల దాడిలో గాయాలు

వైరారూరల్: కోతుల దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని నారపునేనిపల్లికి చెందిన ఆర్.ల క్ష్మయ్య మంగళవారం సెంటర్‌కు రాగా.. ఆయనపై కోతులు దాడి చేయడంతో రెండు కాళ్లకు తీవ్ర గాయాలై నడవలేని స్థితికి చేరుకున్నాడు. దీంతో ఆయనను వైరా ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

కేఎంసీ పారిశుద్ధ్య కార్మికురాలు మృతి



నాగరాణి (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: అధికారులు మందలించారనే మనస్తాపంతో గడ్డి మందు తాగిన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికురాలు మహంకాళి నాగరాణి(30) చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువుల కథనం ప్రకారం.. నాగరాణి భర్త అప్పారావు కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో ఆమె ఔట్ సోర్సింగ్ విధానంలో పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వర్తిస్తూ ఇద్దరు కుమార్తెలను పోషిస్తోంది. నగరంలోని రాపర్తినగర్‌లో ఉండే ఆమె ఇటీవల కేఎంసీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో నాగరాణిని జవాన్ జ్యోతి ఈ నెల 18న కేఎంసీ కార్యాలయంలోని అసిస్టెంట్ కమిషనర్ వద్దకు తీసుకొచ్చింది. ఈక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి ఉద్యోగాల పేరుతో డబ్బు వసూలు చేయడం ఏమిటని చేయడమేమిటని ప్రశ్నిస్తూ తిరిగి చెల్లించాలని, జరిగిదంతా పేపర్‌పై రాసి సంతకం చేయాలని మందలించినట్లు నాగరాణి తల్లి, సోదరుడు ఆరోపించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం రాత్రి ఇంట్లోనే గడ్డి మందు తాగగా బంధువులు ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఈఎస్ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నాగరాణి మంగళవారం మృతి చెందింది. ఈ విషయమై అధికారులు స్పందిస్తూ ఉద్యోగం ఇప్పించేందుకు డబ్బు తీసుకున్నట్లు, తిరిగి చెల్లించేందుకు నాగరాణి అంగీకరించిందని, ఘటనపై విచారణ చేస్తుండగానే మరుసటి రోజు ఆమె పురుగుల మందు తాగిందని వెల్లడించారు.

ఏసీ, జవాన్లపై కేసు

ఖమ్మంక్రైం: కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, ఇద్దరు సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ శ్రీధర్ తెలిపారు. పారిశుద్ధ్య కార్మికురాలు నాగరాణి విషయంలో జవాన్లు సూరేపల్లి శ్రీను, గణేష్ జ్యోతి అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరికి ఫిర్యాదు చేయడంతో ఆమె దూషించడాన్ని తట్టుకోలేక గడ్డి మందు తాగిందని బంధువులు ఫిర్యాదు చేశారు. దీంతో అసిస్టెంట్ కమిషనర్, ఇద్దరు జవాన్లపై హత్యాయత్నం క్రింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా...


తిరుమల ఆలయంలోని ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న టీటీడీ ఈవో

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని మంగళ వారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆనంద నిలయం మొదలుకుని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. కాగా, బుధవారం ఉగాది ఆస్థానం సందర్భంగా బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

సీఆర్డీఏ ప్రాంతంలోనూ పేదలకు ఇళ్లు

గెజిట్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీ సీఆర్డీఏ) పరిధిలో నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌లో ఆర్–5 జోన్ ఏర్పాటు చేస్తూ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు, తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలులో 900.97 ఎకరాలను ఆర్–5 జోన్‌గా నిర్ణయించింది. సీఆర్డీఏ పరిధిలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, నిరుపేదలకు అక్కడ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. సీఆర్డీఏ చట్టంలోని నిబంధనల ప్రకారం మొత్తం ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూమిలో ఐదు శాతం నిరుపేదలకు కేటాయించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాజధాని ప్రాంతంలోని ఆర్–5 జోన్‌లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఆర్డీఏ సిద్ధమవుతోంది. నెల రోజుల్లో 900.97 ఎకరాల్లో లేఅవుట్ సిద్ధం చేసి కలెక్టర్లకు అప్పగించనున్నట్లు సమాచారం. గతంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో దాదాపు 54 వేల మంది లబ్ధిదారులను గుర్తించారు. వారందరికీ ఆర్–5 జోన్‌లో ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నారు.

చదువులకు 'బలం'!

జగనన్న గోరుముద్దలో మరో పోషకాహారం: సీఎం జగన్

- బడి పిల్లలకు ఉదయం పూట రాగి జావ
- సమృద్ధిగా ఐరన్, కాల్షియంతో బాల్యానికి బలం
- ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో 38 లక్షల మందికి రాగి జావ
- మంచి మేనమామలా 15 రకాల పదార్థాలతో పిల్లలకు రుచికరమైన మెనూ



సాక్షి, అమరావతి: మన విద్యార్థులంతా భావి ప్రపంచంతో పోటీపడి రాణించేలా ప్రతి అడుగులోనూ వారికి అండదండలు అందిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పిల్లలకు మంచి మేనమామలా వారికి అందించే ఆహారం నుంచి ఉన్నత చదువులు, ఉద్యోగాల దాకా అన్ని విషయాల్లోనూ వారి బాగోగులే లక్ష్యంగా నడుస్తున్నామన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ కూడా పిల్లల బాగు కోసం ఇంత తపన పడలేదన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. 'మన ప్రభుత్వం రాక ముందు పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నాయి..? ఒక సారి తేడాను గమనించండి. పిల్లలు ఏం తింటున్నారు? అని ఒక ముఖ్యమంత్రి ఆలోచన చేసిన పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. మనం చేయకపోతే ఇంకెవరు చేస్తారన్న మంచి ఆలోచనతో గోరుముద్దను చేపట్టాం. పిల్లలకు మంచి మేనమామలా 15 రకాల ఆహార పదార్థాలతో రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నాం. మధ్యాహ్న భోజనానికి గతంలో ఏడాదికి కేవలం రూ.450 కోట్లు కూడా ఖర్చు చేయని దుస్థితి. ఇప్పుడు గోరుముద్ద కోసం ఏడాదికి రూ.1,824 కోట్లు ఖర్చు చేస్తున్నాం'అని తెలిపారు. ఇప్పుడు దీనికి అదనంగా రాష్ట్రవ్యాప్తంగా 44,392 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 37,63,698 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో ఉదయం పూట రాగిజావ అందించే కార్యక్రమాన్ని మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఏప్రిల్‌లో పదో తరగతితో పాటు మిగిలిన పిల్లలకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో వారందరికీ ఓ మేనమామగా ఆల్ ద వెరీ బెస్ట్ చెబుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...

మొదటి రోజు నుంచే..

అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజు నుంచి చదువులను సంస్కరించడంపై దృష్టి పెట్టాం. అందులో భాగంగానే గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. చదువుకునే విద్యార్థులను ప్రోత్సహిస్తూ అమ్మ ఒడి, విద్యాకానుక, నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు అందిస్తున్నాం. 8వ తరగతిలోకి వచ్చిన వెంటనే పిల్లలకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. ఇక 6వ తరగతి నుంచి ప్రతి తరగతి గదిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ ప్యానెల్స్) ద్వారా డిజిటల్ బోధనను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నాడు – నేడు పూర్తైన స్కూళ్లలో జూన్ నుంచి అమలులోకి తీసుకొస్తాం. ఇలా ప్రతి అడుగులోనూ పిల్లలను చేయిపట్టి నడిపిస్తున్నాం.

మరింత బలవర్ధకంగా గోరుముద్ద

గోరుముద్దను ఇప్పటికే రోజుకొక మెనూతో రుచికరంగా అమలు చేస్తున్నాం. ఇప్పుడు మరింత బలవర్ధకంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాం. ఇవాళ్టి నుంచి పిల్లలకు రాగిజావ కూడా అందిస్తూ గోరుముద్దను మరింత పుష్టికరంగా తీర్చిదిద్దుతున్నాం. రాగి జావ పిల్లల్లో సమృద్ధిగా ఐరన్, కాల్షియం కంటెంట్ పెరిగేలా దోహదపడుతుంది. మిడ్ డే మీల్స్ అంటూ గత ప్రభుత్వ హయాంలో మొత్తం సంవత్సరం అంతా కలిపినా కూడా ఏడాదికి రూ.450 కోట్లు కూడా మధ్యాహ్న భోజనానికి ఖర్చు చేయని దుస్థితి. అలాంటి అధ్వాన్నమైన పరిస్థితుల నుంచి గోరుముద్ద అనే కార్యక్రమం ద్వారా రోజుకొక మెనూతో పూర్తిగా మార్చి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. గతంలో రూ.450 కోట్లు మాత్రమే ఉన్న బడ్జెట్‌ను ఇప్పుడు ఏడాదికి రూ.1,824 కోట్లకు పెంచి గోరుముద్ద కోసం ఖర్చు చేస్తున్నాం. ఇప్పుడు రాగి జావ కోసం అదనంగా మరో రూ.86 కోట్లు ఇస్తున్నాం. రోజుకో మెనూతో పిల్లలకు రుచికరమైన భోజనం అందిస్తున్నాం.

సత్యసాయి ట్రస్టు సహకారంతో..

పిల్లలకు రాగిజావ అందించే కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు భాగస్వామి కావడం నిజంగా మంచి పరిణామం. ఏటా దాదాపు రూ.86 కోట్లు ఖర్చయ్యే రాగి జావ కోసం సత్యసాయి ట్రస్టు రూ.42 కోట్లు అందిస్తుండగా మిగిలిన రూ.44 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరుస్తూ మంచి కార్యక్రమానికి ముందడుగు వేస్తున్నాం.

తవ్వేకొద్దీ బయటపడుతున్న మార్గదర్శి మోసాలు

రూ.459.98 కోట్లను దారి మళ్లించినట్లు ఇప్పటికే ఆడిట్‌లో నిర్ధారణ

- తాజాగా మరిన్ని అక్రమాలు బట్టబయలు
- ప్రతి గ్రూపులో పాడుకునే రెండో నెల పాటకు ఎటువంటి చందా కట్టని వైనం
- ఖాళీ చిట్లకు చెల్లించాల్సిన చందాలకు ఎగనామం
- ఇవేమీ చెల్లించకుండానే ప్రతి గ్రూపుపైనా ప్రతి నెలా 5 శాతం కమీషన్ స్వీకరణ
- గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వెలుగులోకి
- ఈ ఉల్లంఘనలపై ఆయా బ్రాంచ్‌ల వివరణ కోరిన రిజిస్ట్రేషన్ల శాఖ



సాక్షి, అమరావతి: ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాలు తవ్వే కొద్దీ బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటికే రూ.459.98 కోట్ల సొమ్మును చట్టవిరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, షేర్లు, తదితరాల్లోకి మళ్లించినట్లు ఆడిటింగ్‌లో అధికారులు నిర్ధారించారు. తద్వారా చందాదారుల సొమ్మును తమ వ్యక్తిగత లబ్ధి కోసం రామోజీరావు, ఆయన కోడలు, మార్గదర్శి ఎండీ శైలజ వినియోగించుకున్నట్లు స్పష్టమైంది. తాజాగా ప్రతి చిట్ గ్రూపులో ఖాళీ చిట్లు, కంపెనీ పాడుకునే రెండో నెల చిట్ల లావాదేవీల్లోనూ భారీగా అవకతవకలకు పాల్పడినట్లు తేలింది. మార్గదర్శి మేనేజర్లు సమర్పించిన మినిట్స్‌ను విశ్లేషించిన ఆడిట్ అధికారులు ఈ మోసాలను గుర్తించారు. ఖాళీ చిట్లకు గానీ, ప్రతి చిట్ గ్రూపులో కంపెనీ పాడుకునే రెండో నెల చిట్‌కు సంబంధించి గానీ ఎటువంటి సొమ్ము (నెల వారీ చందా) చెల్లించలేదని వెల్లడైంది. ప్రతి చిట్ గ్రూపులో రెండో నెల చిట్ పాటను కంపెనీయే పాడుకునే అవకాశం ఉంది. అందుకోసం అందరి చందాదారుల మాదిరిగానే కంపెనీ కూడా చందా కట్టాలి. కానీ చందా కట్టకుండానే ఆ రెండో నెల చిట్‌ను పాడుకుని కంపెనీ జమ చేసుకుంటోంది. కంపెనీ తరఫున కట్టాల్సిన ఎటువంటి చందాలు కట్టకుండానే ప్రతి నెలా ప్రతి గ్రూపు నుంచి 5 శాతం కమీషన్‌ను తీసుకుంటోంది.

ఆధారాలతో సహా వెలుగుచూసిన అక్రమాలు

గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని పలు మార్గదర్శి యూనిట్లలో ఈ మోసాలు ఆధారాలతో సహా బయటపడ్డాయి. గుంటూరు జిల్లాలో ఐదు చిట్ గ్రూపులను విశ్లేషించగా వాటి ద్వారా రూ.1.18 కోట్లను చిట్ కమీషన్‌గా, రూ.1.73 కోట్లను రెండో నెల పాడుకున్న చిట్ సొమ్ముగా కంపెనీ జమ చేసుకుంది. కానీ పాడుకున్న రెండో నెల చిట్ చందా.. అలాగే ఆ గ్రూపులో తన పేరు (ఫోర్‌మెన్) మీద ఉంచుకున్న ఖాళీ చిట్లకు చెల్లించాల్సిన చందా సొమ్ము రూ.6.98 కోట్లు చెల్లించలేదని అధికారులు గుర్తించారు. విజయనగరం జిల్లాలో 12 చిట్ గ్రూపులను విశ్లేషించినప్పుడు ఫోర్‌మెన్ కమీషన్ రూ.60.50 లక్షలు, రెండో నెల పాడుకున్న చిట్ మొత్తం రూ.1.05 కోట్లను కంపెనీ ఖాతాలో వేసుకున్నారు. కానీ వాటికి సంబంధించి కట్టాల్సిన రెండో నెల చిట్ చందాలు, కంపెనీ పేరు మీద ఉన్న ఖాళీ చిట్ల చందాల మొత్తం రూ.54.85 లక్షలు కట్టలేదని తేలింది. అలాగే శ్రీకాకుళం జిల్లాలో 28 చిట్ గ్రూపులను పరిశీలించినప్పుడు వాటికి ఫోర్‌మెన్ కమీషన్ రూ.3.47 కోట్లు, రెండో నెల పాడుకున్న చిట్ల మొత్తం రూ.2.73 కోట్లను కంపెనీ తీసుకుంది. కానీ వాటికి సంబంధించి కట్టాల్సిన రూ.2.88 కోట్ల చందా సొమ్మును కట్టలేదు.

భారీగా ఉల్లంఘనలు..

నెల వారీగా చందాదారులతోపాటు కట్టాల్సిన సొమ్మును కట్టకుండానే కమీషన్ తీసుకోవడం, ప్రతి గ్రూపులోనూ చందా కట్టకుండానే రెండో నెల చిట్‌ను పాడుకుని ఆ సొమ్మును తీసుకోవడం ద్వారా మార్గదర్శిలో చిట్లు వేసిన వారిని రామోజీరావు, ఆయన కోడలు శైలజ మోసం చేసినట్లు స్పష్టమైంది. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల సొమ్మును పణంగా పెట్టి భారీగా ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. ఖాళీగా ఉన్న చిట్లకు సంబంధించి ఎటువంటి చందా చెల్లించకుండా మిగిలిన చందాదారులను మభ్యపెట్టినట్లు తేలింది. ఈ ఉల్లంఘనలకు సంబంధించి వివరణ ఇవ్వాలని సంబంధిత మార్గదర్శి బ్రాంచ్‌లను ఆదేశించినట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ రామకృష్ణ తెలిపారు.

జనసేనతో పొత్తు ఉన్నా లేనట్లే

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోరినా పవన్ స్పందించలేదు
- ఎమ్మెల్సీ మాధవ్ వెల్లడి



సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న తనకు మద్దతుగా బహిరంగ ప్రకటన చేయాలని స్వయంగా మిత్రపక్ష జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను కోరినా ఆయన స్పందించలేదని.. క్షేత్ర స్థాయిలో కలిసి పనిచేసే పరిస్థితి లేనప్పుడు బీజేపీ–జనసేన 'కలిసి ఉన్నా లేనట్లే'అని శాసనమండలిలో బీజేపీ పక్ష నాయకుడు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ ఘాటుగా స్పందించారు. పొత్తులో కొనసాగుతున్నప్పటికీ జనసేన ఎక్కడా బీజేపీ అభ్యర్థులకు మద్దతు తెలపని అంశంపై మంగళవారం విజయవాడలో జరిగిన బీజేపీ రాష్ట్ర పదాధికారులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జిల సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. సమావేశంలో చర్చించిన అంశాలను మాధవ్ వెల్లడించారు. 'మేం జనసేనతో కలిసి ఉన్నా లేనట్లేనన్న వాతావరణం ఉంది. ఇటీవల పవన్ కూడా జనసేన–బీజేపీ పొత్తు ఉంది అన్నారు. అయితే, క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయడం లేదన్నది వాస్తవం. నిజంగా పొత్తులో ఉంటే క్షేత్రస్థాయిలో కూడా కలిసి పనిచేయాలని కోరుతున్నాం'.. అని మాధవ్ వ్యాఖ్యానించారు. 'కలిసి పనిచేస్తే ప్రజా మద్దతు రెండు పార్టీలకు ఉంటుంది. ఆయనా (పవన్) నమ్మాలి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రకటన చేయాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు కోరారు. కానీ, ప్రకటన రాలేదు'.. అని మాధవ్ చెప్పారు. కలిసి పనిచేసే విషయంలో బీజేపీ నుంచే స్పందనలేదని పవన్‌కళ్యాణ్ అంటున్నారని విలేకరులు ప్రశ్నించగా.. 'ఆయన వైపు నుంచే స్పందనలేదు'అని బదులిచ్చారు.

జిల్లా వార్తలు

'సామ్రాజ్య' వేడుకలకు సన్నాహం


విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న రామాలయం

- బ్రహ్మోత్సవ శోభ సంతరించుకున్న భద్రగిరి
- నేడు ఆలయంలో పుష్కర పట్టాభిషేకానికి అంకురార్పణ
- యాగశాలలో రామాయణ క్రతువుకు ఏర్పాట్లు
- నేటి నుంచి ఏప్రిల్ 5 వరకు నిత్యకల్యాణాలు రద్దు


హోమగుండం సిద్ధం చేస్తున్న భక్తులు

భద్రాచలం: భద్రగిరిలో బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకళ్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. అలాగే ఈనెల 31 వరకు పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక ప్రయుక్త ద్వాదశ కుండాత్మక చతుర్వేద హవనం, శ్రీరామయణ మహాక్రతువు నిర్వహించనున్నారు. 30, 31 తేదీల్లో శ్రీసీతారాముల కల్యాణం, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ఈ ఏడాది పుష్కర పట్టాభిషేకం సందర్భంగా యాగశాలలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజాది కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.

నేడు ఉగాది వేడుకలు..

శోభకృత్ నామ సంవత్సరాది(ఉగాది)ని పురస్కరించుకుని గర్భాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. వేప పూత పచ్చడిని నివేదన చేసి భక్తులకు పంచుతారు. ఉదయం 7 గంటలకు మూలవరులకు ప్రత్యేక అభిషేకం (తిరుమంజనం) నిర్వహిస్తారు. ప్రతీ ఆదివారం మాత్రమే జరిగే ఈ అభిషేకం ఏడాదిలో ఐదు ప్రత్యేక రోజుల్లోనూ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉగాది, శ్రీరామనవమి, వైశాఖ పునర్వసు, నరక చతుర్దశి, వైకుంఠ ఏకాదశి రోజుల్లో ప్రత్యేకంగా అలకరించి అభిషేకం చేస్తుంటారు. సాయంత్రం ఆస్థాన పురోహితులచే పంచాంగ శ్రవణం ఉంటుంది.

29 వరకు ప్రత్యేక పూజలు..

శ్రీ రామాయణ క్రతువుకు శ్రీకారం చుట్టి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. బుధవారం అంకురార్పణ అనంతరం 29వ తేదీ వరకు యాగశాలలో, ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. 23 నుంచి 29వ తేదీ వరకు ఉదయం 7 గంటలకు తిరువారాధన, సేవాకాలం, తీర్థ ఘోష్ఠి, 8.30 గంటలకు రామాయణ మహాక్రతువులో భాగంగా చతుర్వేద, రామాయణ, రామషడాక్షరీ, నారాయణ అష్టాక్షరీ మంత్ర హోమాలు, 11 గంటలకు సంక్షేప రామాయణ సామూహిక పారాయణం, 11.30 గంటలకు నిత్య పూర్ణాహుతి, ప్రసాద వినియోగం, సాయంత్రం 5.30 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామస్తోత్ర సామూహిక పారాయణం, 6 గంటలకు రామాయణ మహా క్రతువు హోమాలు, 7 గంటలకు వేదిక వద్ద రామాయణ ప్రవచనం, రాత్రి 8 గంటలకు నిత్య పూర్ణాహుతి, ప్రసాద వియోగం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నారు.

ఏప్రిల్ 5 వరకు నిత్యకల్యాణాలు రద్దు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం నుంచి ఏప్రిల్ 5 వరకు స్వామివారి నిత్యకల్యాణ వేడుకను, ఈనెల 26 నుంచి ఏప్రిల్ 5 వరకు దర్బారు సేవలను రద్దు చేశారు. 26 నుంచి ఏప్రిల్ 11 వరకు పవళింపు సేవలను కూడా నిలిపివేయనున్నారు. ఈనెల 30న శ్రీరామ పునర్వసు దీక్ష, ఏప్రిల్ 12న నూతన పర్యంకోత్సవం, ఏప్రిల్ 27న శ్రీరామ పునర్వసు దీక్ష విరమణ, ఏప్రిల్ 28న పట్టాభిషేకం జరగనున్నాయి.

నేటి పూజా కార్యక్రమాలిలా...

పుష్కర పట్టాభిషేక ఉత్సవాలకు ఆలయం వద్ద నిర్మించిన ప్రత్యేక యాగశాలలో బుధవారం అంకురార్పణ చేస్తారు. ఉదయం ఏడు గంటలకు మూలమూర్తుల సన్నిధిలో ఉత్సవ అనుజ్ఞ తీసుకుంటారు. 7.30 గంటలకు ఓంకార ధ్వజారోహణం ఎనిమిది గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, రక్షాబంధనం, చిత్రకూట మండపంలో వాస్తు హోమాలు, 11.30 గంటలకు పుష్కర యాగశాలలో పర్యగ్నికరణం, యాగశాల ప్రవేశము, దేవాలయ ప్రాంగణములో సంక్షేప రామాయణ హవనం నిర్వహిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు ఆలయంలో దర్బార్ సేవ, ఆరు గంటలకు ఆస్థాన పండితులచే పంచాంగ శ్రవణం, రాత్రి ఏడు గంటలకు యాగశాల వద్ద శ్రీ రామాయణ క్రతువు, ఎనిమిది గంటలకు అంకురార్పణ, ప్రసాద వినియోగం కార్యక్రమాలు జరుగుతాయి.

సామాజిక వనాలను పరిశీలించిన డీఎఫ్‌ఓ


స్వాధీనం చేసుకున్న కలపను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ విక్రమ్‌సింగ్

తల్లాడ: మండలంలో గోపాలపేట, నరసింహారావుపేట, బాలపేట గ్రామాల్లో సామాజిక వనాలను జిల్లా అటవీ అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్ మంగళవారం పరిశీలించారు. సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణానికి అటవీ భూమిని సేకరించిన ప్రభుత్వం.. తల్లాడ మండలంలో నరసింహారావుపేట, గోపాలపేట, బాలపేటల్లోని రెవెన్యూ భూమి 24 హెక్టార్లను కేటాయించింది. ఈ భూముల్లో పెంచుతున్న సామాజిక వనాలను డీఎఫ్‌ఓ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బాలపేటలో అధికారులు స్వాధీనం చేసుకున్న 31 నార ఈప దిమ్మెలను పరిశీలించి సమగ్ర విచారణ చేయాలని ఆదేశించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి అరవింద్‌కుమార్, ఎఫ్‌బీఓ వెంకటేశ్వర్లు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో ఎవరికి ఏం చేశారు?

- బీజేపీ పాలనలో కార్పొరేట్లకు మేలు
- హామీలు నెరవేర్చకపోతే కేసీఆర్‌పైనా పోరాడుతాం..
- జనచైతన్య యాత్రలో తమ్మినేని వీరభద్రం


ఏన్కూరులో జనచైతన్యయాత్రకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఏన్కూరు/తల్లాడ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యాన చేపట్టిన జనచైతన్య యాత్ర మంగళవారం సాయంత్రం జిల్లాకు చేరుకోగా.. ఏన్కూరు, తల్లాడలో జరిగిన సభల్లో ఆయన మాట్లాడారు. కులాలు, మతాల వారీగా ప్రజలను రెచ్చగొడుతూ బీజేపీ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిన గాంధీని హత్య చేసిన గాడ్సేకు మద్దతు ఇస్తూ.. రాజ్యాంగం రాసిన అంబేద్కర్‌ను మాత్రం కించపరుస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు, నల్లధనం పంపిణీ.. ఇలా అన్ని అంశాల్లోనూ మోదీ ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. బీజేపీని వ్యతిరేకించే వారిని కేంద్ర దర్యాప్తు సంస్థల్లో వేధిస్తున్నారని.. సీఎం కేసీఆర్ కుమార్తె కవితపై నమోదు చేసిన కేసు కూడా అలాంటిదేనని చెప్పారు. ఏదిఏమైనా బీజేపీ వ్యతిరేక శక్తులన్నింటినీ ఏకం చేసి రానున్న ఎన్నికల్లో ఓడిస్తామని వీరభద్రం వెల్లడించారు. కాగా, రాష్ట్రంలో 11 లక్షల మంది పోడుసాగుదారులకు పట్టాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే సీఎం కేసీఆర్‌పై కూడా పోరాటానికి సిద్ధమని తెలిపారు. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీలో చేరడానికి సిద్ధమవుతున్న కొందరు నేతలు ఆ పార్టీ విషనాగు అని తెలుసుకోవాలని హితవు పలికారు. కాగా, సీపీఎం, సీపీఐ పార్టీలు జిల్లాలో కలిసి పనిచేసేలా చర్చలు జరిగాయని.. సీట్ల విషయంలోనూ ఇబ్బంది లేదని వీరభద్రం వెల్లడించారు. తల్లాడలో జరిగిన సభకు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై సంఘీబావం ప్రకటించి మాట్లాడారు. ఈ యాత్రలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడగు భాస్కర్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావుతో పాటు నాయకులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, ఐనాల రామలింగేశ్వరరావు, డి.నాగేశ్వరావు, బానోతు బాలాజీ, ఏర్పుల రాములు, ఇటికాల లెనిన్, మాచర్ల భారతి, నాగరాజు, తాతా భాస్కర్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, శీలం ఫకీరమ్మ పాల్గొన్నారు.

సినిమా తరహాలో ఛేజింగ్

- గంజాయి స్మగ్లర్లను వెంటాడి బంధించిన పోలీసులు
- రూ.30లక్షల సరుకు స్వాధీనం, నలుగురి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

కూసుమంచి: ఒడిశా నుంచి ఖమ్మం మీదుగా కర్ణాటకకు నలుగురు వ్యక్తులు రెండు కార్లలో గంజాయి తరలిస్తుండగా సినీ ఫక్కీలో చేజింగ్ చేసిన టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన వివరాలను కూసుమంచి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కూసుమంచి సీఐ కంది జితేందర్‌రెడ్డి, స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ లతీఫ్ వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరికి చెందిన అరుణ్‌మండల్, సాథన్ జోధ్యా, మణింద్ర బాబీ, గోవిందు అల్తార్ రెండు కార్లలో రూ.30.60లక్షల విలువైన 153 కిలోల గంజాయి తీసుకుని కర్ణాటక బయలుదేరారు. ఖమ్మం, హైదరాబాద్ మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు, బెంగళూరు వెళ్లి గంజాయి అమ్మేందుకు వెళ్తున్నారు. ఈమేరకు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్థానిక పోలీసులతో కలిసి మంగళవారం నాలుగు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టారు. అయితే, దుండగులు అప్పటికే ఖమ్మం దాటగా.. కూసుమంచి మండలం పాలేరు చెక్ పోస్ట్ వద్ద నిఘా వేయగా.. గుర్తించిన గంజాయి రవాణాదారులు తమ కార్లను వెనక్కి తిప్పారు. దీంతో పోలీసులు వారిని కిలోమీటర్ దూరం మేర వెంబడించారు. ఈక్రమంలో పాలేరు పెట్రోల్ బంక్ వద్ద ఓ వాహనాన్ని పోలీసులు చుట్టుముట్టడంతో ఆపారు. మరో కారు ఆగినట్లుగా ఆగి మళ్లీ వెళ్తుండడంతో అక్కడే ఉన్న రఘునాథపాలెం ఎస్సై రవి కారు స్టీరింగ్ కదలకుండా గట్టిగా పట్టుకున్నా డ్రైవర్ ముందుకు పోనిచ్చారు. దీంతో ఎస్సైను కారు ఈడ్చుకువెళ్తూ సూచిక బోర్డు ఢీకొట్టి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. దీంతో మిగతా పోలీసులు అప్రమత్తమై ఆ కారుతో పాటు నిందితులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరరావు, ఎస్‌టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్, పోలీసు ఎస్సైలు మురళి, ముబాసిన్ అహ్మద్, శంకర్, ఏఎస్సై కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, అటు గంజాయి రవాణాదారులు, ఇటు పోలీసుల వాహనాలు వేగంగా రహదారిపై వెళ్తుండడంతో ఏం జరుగుతుందో తెలియక మిగతా వాహనదారులు ఆందోళనకు గురయ్యారు.

గంజాయి రవాణా కట్టడిపై దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీ జనార్దన్‌రెడ్డి

నేలకొండపల్లి: జిల్లా మీదుగా గంజాయి రవాణాను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేసిన మద్యం లైసెన్స్‌దారులతో సమావేశమయ్యారు. అనంతరం జనార్దన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈనెలలో 600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే, నేరాల నియంత్రణకు ప్రతీ కానిస్టేబుల్‌కు ఐదు గ్రామాల చొప్పున బీట్లుగా కేటాయించినట్లు చెప్పారు. ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల సమీపాన బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఈఎస్ నాగేందర్‌రెడ్డి, నేలకొండపల్లి సీఐ ఆర్.విజేందర్ పాల్గొన్నారు.